క్లుప్తంగా

పెన్షనర్ల దినోత్సవం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు విశ్రాంత ఉద్యోగులను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల మండల అధ్యక్షుడు కాల్వ సుందర్రావ్, కార్యదర్శి కేఎల్ఎన్ అచార్యాలు, నాయకులు చింతూరు గాంధీ, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

'పల్లా'కు శుభాకాంక్షలు



ములుగు: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎంపీపీ గంద్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్ దంపతులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం

మంగపేట: జాతీయ మానవ హక్కుల మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా బుచ్చంపేటకు చెందిన తాళ్లూరి మధూకర్, ప్రధాన కార్యదర్శిగా రాజుపేటకు చెందిన కర్రి శ్రీనును నియమిస్తు రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య గురువారం నియామకం పత్రాన్ని అందజేశారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఈసీ మెంబర్ ఏడుకొండలు, జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు మనోహర్, శ్రీనివాసాచారికి మధూకర్, శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జిల్లా స్థాయి యువజన పోటీలు

ములుగు: జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నేడు(శుక్రవారం) జిల్లా స్థాయి యువజన పోటీలు నిర్వహించనున్నట్లుగా ఇన్‌చార్జ్ యువజన క్రీడల అధికారి కొండా వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతలో దాగి ఉన్న కళలను వెలికి తీయడానికి సాంస్కృతిక, జీవన నైపుణ్యం విభాగాల్లో 15 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి పోటీలు ఉంటాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 73303 26241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బియ్యం పంపిణీ



ములుగు రూరల్: మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన బిజ్జ నాగేశ్వర్‌రావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీ రామ క్రిష్ణ సేవా ట్రస్టు సభ్యులు పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. ట్రస్ట సభ్యుడు రవిగౌడ్, శ్రీహరిగౌడ్, కొండల్‌రావు, విజయ, రమాదేవి, మంగక్క, విద్యాసాగర్, రాములు తదితరులు ఉన్నారు.

అటవీ జంతు మాంసం స్వాధీనం


మహాముత్తారం: మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో అటవీ జంతు మాంసం స్వాధీనం చేసుకున్నట్లు పెగడపల్లి ఇన్‌చార్జ్ రేంజర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఇన్‌చార్జ్ రేంజర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మగూడెంకు చెందిన రమేష్, నరేష్ అనే ఇద్దరి వ్యక్తుల ఇళ్ల వద్ద అటవీ జంతు మాంసం ఉన్నట్లు సమాచారంతో సిబ్బందితో గురువారం దాడి చేసినట్లు తెలిపారు. ఈదాడిలో అటవీ జంతు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు.

ఇద్దరి రిమాండ్

మహదేవపూర్: మండల కేంద్రంలో అప్పుగా తీసుకున్న రూపాయలు కట్టకుండా పారిపోయిన ఇద్దరు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గుడల శ్రీనివాస్ వద్ద దేవేందర్, భూపాతి విజ్ఞన్‌సులు రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నారు. తిరిగి అప్పు ఇవ్వమంటే ఇంకా రూ.లక్ష ఇవ్వాలని ఇస్తే మొత్తం తర్వాత ఇస్తామని బెదిరించి పారిపోయారు. దీంతో శ్రీనివాస్ వారిపై అక్టోబర్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచరణ చేపట్టి పారిపోయిన ఇద్దరిని అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక దందా!

- పట్టించుకోని అధికారులు
- అరికట్టాలని కోరుతున్న ప్రజలు



అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

మంగపేట: మండలంలో ఇసుక దందా జోరుగా కొనసాగుతోంది. మండలంలోని మంగపేట, కమలాపురం, మల్లూరు, రాజుపేట గ్రామాల్లో ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా సిమెంటు, ప్లెయాష్ ఇటుకలు, గృహోపకర వస్తువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి యజమానులు అక్రమంగా మంగపేట గొరారం, మల్లూరు, రాజుపేట ముసలమ్మ వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ పలు రకాల సిమెంటు వస్తువులను తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఎంచుకున్న కొందరు ట్రాక్టర్ యజమానులు ఒకటి రెండు ట్రిప్పులకు అనుమతి తీసుకుని 10 నుంచి 15 ట్రిప్పుల ఇసుకను తరలిస్తు మినీ ఇండస్ట్రీస్ యజమానులకు, గృహనిర్మాణాలు చేపడుతున్న వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు ట్రాక్టర్లపై ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. విషయాన్ని స్థానికులు ఎవరైనా రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తే ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ఒకరిద్దరు అధికారులు అక్రమార్కులకు ఫలానా వ్యక్తి ఫిర్యాదు చేస్తున్నారని చెపుతూ వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అధికారుల కనుసన్నల్లో ఈ దందా కొనసాగుతొందని ప్రచారం జరుగుతోంది. ఇళ్ల, మరుగుదొడ్ల నిర్మాణం నిర్మాణాలకు, మిర్చి కల్లాల ఏర్పాటు కోసం ఇసుక తరలించుకునేందుకు రైతులకు అనుమతి ఇచ్చే విషయంలో నిబంధనలు పెట్టే రెవెన్యూ అధికారులకు అక్రమంగా ఇసుకను తరలించి వ్యాపారం చేస్తున్న కనిపించడం లేదా పలువురు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ స్పందించి మండలంలో అక్రమ ఇసుక దందాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న లూర్దురాజు

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు గురువారం మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. దాదాపు 350 నిరుపేద కుటంబాలకు సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరవై సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధికి మహిళ గ్రూపులు, చిల్డ్రన్స్ పార్లమెంట్ యూత్ అండ్ ఫార్మర్ గ్రూప్ ఏర్పాటుతో పాటు డ్రాప్ ఔట్ పిల్లలకు విద్య గ్రామల్లో సామాజిక సేవా కార్యక్రమాలు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ హనుమంతు, కామేష్, పాస్టర్లు సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిడెం శివ, మన్నెం సునీల్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన మల్క వెంకటరమణ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడికి చికిత్స నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హైదరాబాద్‌లోని శాసనసభ ప్రాంగణంలో రూ.3 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మోకిరాల మధు వంశీకృష్ణ, విడిదినేని అశోక్, దారకొండ నాగరాజు, జోడు ప్రదీప్ ఉన్నారు.

'ఉపరాష్ట్రపతిని అవమానించడం సరికాదు'



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

ములుగు రూరల్: ఉప రాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్ ఖడ్‌ను అవమానించడం సరికాదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప రాష్ట్రపతిని టీఎంసీ ఎంపీ ఈ కల్యాణ్ బెనర్జీ హస్యప్రదర్శన చేయడం తీవ్రమైన చర్య అని అన్నారు. ఇప్పటికైనా విపక్ష సభ్యులు క్షమాపణ చెప్పి సభ మర్యాదలను గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తక్కల్లపల్లి దేవేందర్‌రావు, రవీంద్రాచారి, వాసుదేవరెడ్డి, కృష్ణాకర్‌రావు, పరమేశ్వర్, ఇమ్మడి రాకేష్‌యాదవ్, రాకేష్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌ను కలిసిన నాయకులు



సేవాలాల్ చిత్రపటం ఇస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్‌గా తెలంగాణ రాష్ట్రానికి నియామకమైన డాక్టర్ రవీందర్‌నాయక్‌ను సేవలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్ నాయక్‌తో పాటు పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని మర్యాద పూర్వకంగా కలిశారు. సంతు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని బహూకరించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాహుల్ నాయక్, జిల్లా సేవాలాల్ విద్యార్థి సేన నాయకులు జర్పుల పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంచి గుణాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జ్యోతి

ఎస్ఎస్ తాద్వాయి: బాలలు విద్యార్థి దశ నుంచే మంచి గుణాలను అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కాటాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. ఐసీపీఎస్ సోషల్ వర్కర్ జ్యోతి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై లైంగిక వేధింపులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాఫర్ అలీ, శ్రీనివాస్, జీవన్‌లాల్, జైపాల్, పద్మజ, సంధ్యారాణి పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న సూర్య

ములుగు రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చ శ్రీనివాస్, దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సదానందంగౌడ్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య గురువారం పరామర్శించారు. ఆయన వెంట నల్లెల్ల భరత్, తదితరులు ఉన్నారు.

దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ సోదరుడు జయప్రకాశ్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ గురువారం పరామర్శించారు. జయప్రకాశ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ



ఉపాధ్యాయులకు వివరిస్తున్న భాస్కర్‌రావు

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీహైస్కూల్ ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా స్కీం కింద ఎంపిక కావడంతో మొదటి దశలో ఉన్న పీఎంసీ పాఠశాలల ఉపాధ్యాయులకు డిజిటల్ నైపుణ్యాలపై గురువారం శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రావుల భాస్కర్‌రావు మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ఉపాధ్యాలందరికీ భవిష్యత్‌లో డిజిటల్ టెక్నాలజీని సునాయాసంగా ఉపయోగించడం, డిజిటల్ సిలబస్, డిజిటల్ లెసన్ ప్లాన్స్, విజన్ టు చేంజ్ , ఎడ్యుకేషనల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఫ్రేమ్ వర్క్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు టెక్నాలజీని సొంతం చేసుకోవడానికి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, పాయం వీరనారాయణ, రాజ్యలక్ష్మి, పావని, జమున, పద్మ, లావణ్య, పఠాన్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలతో కమిటీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ఎస్ఎస్ తాద్వాయి : మేడారం జాతర ట్రస్ట్ బోర్డు కమిటీని ఆదివాసీలతో ఏర్పాటు చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మేడారం మహాజాతరలో జాతర పునరుద్ధరణ కమిటీలు మాత్రమే వేసి పక్షపాతం చూపించారన్నారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పూర్తి స్థాయిలో రెండు సంవత్సరాల కాల పరిమితితో ట్రస్ట్ బోర్డు కమిటీని పూర్తిగా ఆదివాసీలతోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.75 నిధులు మంజూరు చేసినప్పటికీ వరదల వల్ల జరిగిన నష్టానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సరిపోవని, ప్రభుత్వం అదనంగా మరో రూ.50కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. జాతర సందర్భంగా రెండో పంట వేయకుండా నష్టపోతున్న మేడారం పరిసర ప్రాంతాల రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరం నాగేశ్వర్‌రావు, నరేందర్, కరుణాకర్, జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మహేందర్

వాజేడు: అసంక్రమిత వ్యాధులపై మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి, పాయబాటలు, పూసూరు, ముత్తారం కాలనీ గ్రామాల్లో వైద్యాధికారి మహేందర్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అసంక్రమిత వ్యాధి గ్రస్తులను గుర్తించి మందులను అందజేశారు. అనంతరం జ్వరం, జలుబు, దగ్గు, రక్తపోటుతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. సూర్యప్రకాశ్, కోటిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఉచిత ప్రయాణాన్ని సవరించాలి



వినతిపత్రం అందజేస్తున్న చిట్యాల శ్రీనివాస్

కాటారం: తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యంలో సవరణలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు చిట్యాల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణంలో చాలా అనార్థాలు, నష్టాలు ఉన్నాయని హేతుబద్ధంగా సవరణలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ ప్రభుత్వానికి సూచిస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం కల్పించాలని, నెలకు రూ.లక్ష సంపాదించే మహిళా ఉద్యోగులకు ఉచిత ప్రయాణం నిలిపివేయాలన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మంథెన రవీందర్, చిర్ర శ్రీకాంత్, చరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామస్తులకు వివరిస్తున్న అధికారులు

పలిమెల: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం మండలంలోని బూరుగ్గూడెం, సర్వాయిపేట గ్రామాల్లో గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉపాధి కల్పన కోసం అందిస్తున్న బ్యాంకు రుణాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, ఐకేపీ సీసీ స్వామి, పంచాయతీ కార్యదర్శి మధన్, బ్యాంక్ అధికారి, అంగన్‌వాడీలు శివమ్మ, కవిత, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్, వీఏఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కాటారం: విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత



చిట్యాల: విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత



రేగొండ: వ్యాయామ ఉపాధ్యాయుడు రఘుతో విద్యార్థులు

కాటారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో రెండు కిలో మీటర్ల క్రాస్ కంట్రీ రన్నింగ్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని బి.శ్రావణి, 9వ తరగతి విద్యార్థిని డి.సాత్విక అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ చల్ల సునీత తెలిపారు. ఈ నెల 23న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినులు ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేస్తూ పీఈటీ రాజేశ్వరి, విద్యార్థినులను ప్రిన్సిపాల్ అభినందించారు.

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు హెచ్. రాజేశ్వరి, జి.జీవన ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రేగొండ: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 19, 17, 14బాక్సింగ్ పోటీల్లో రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కార్తికేయ, శివ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో మెరిసిన కార్తికేయ, శివలకు శిక్షణనందించిన రంగయ్యపల్లి ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రఘును మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్మల, సతీష్, దేవేందర్‌రెడ్డి, రవీందర్, రవి అభినందించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు రఘు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి శిక్షణనిస్తూ మరింత ముందుకు వెళ్లేలా కృషి చేస్తానని, భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులను బాక్సింగ్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయిలకు తీసుకెళ్తానని అన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి(సీ)లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన జెట్టి కుమారస్వామికి చెందిన దుక్కిటెద్దు ఉదయం గ్రామ శివారులోని పెద్ద చెరువు పక్కన నల్లాల బావి వద్దకు మేత కోసం వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కు తగిలి షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.